క్లుప్తంగా

పెట్రోల్ బంకులో కాంట్రాక్ట్ ఉద్యోగాలు

కొత్తగూడ : మండల కేంద్రంలో జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన ఫిల్లింగ్ స్టేషన్ (హెచ్‌పీ పెట్రోల్ బంక్)లో దినసరి వేతనముతో పని చేసేందుకు కాంట్రాక్ పద్ధతిలో సిబ్బందిని నియమిస్తున్నట్లు జీసీసీ మేనేజర్ దేవ్ తెలిపారు. గురువారం బంక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆసక్తి కలిగిన గిరిజన యువతీ, యువకులు తమ వివరాలను బంకులో ఇవ్వాలని సూచించారు. ఆధార్ కార్డు, కుల,వయసు ధ్రువీకరణ, ఇతర సర్టిఫికెట్లు జత చేయాలని సూచించారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్



నెహ్రూసెంటర్ : జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో గల ప్రభుత్వ భూమిని కాపాడాలని లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్ గురువారం పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాలని జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బానోత్ విష్ణు, శివవర్మనాయక్, మంగిలాల్, డీఎస్ బాలు, రాందాస్, శ్రీను, చందన్, మాలునాయక్, వీరన్న, సుధాకర్, తరుణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పెద్దవంగర : మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బెల్లంకొండ ఎల్లగౌడ్ కుమారుడు శివకుమార్ రోడ్డు ప్రమాదంలో, బొమ్మెరబోయిన సోమన్న అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం బాధిత కుటుంబాలను పరామర్శించి, మనోధైర్యం కల్పించారు. పాలకొండ కృష్ణమూర్తి శర్మ, బెల్లంకొండ సోమనర్సయ్య, కోట అశోక్, కమ్మగాని అశోక్, బొమ్మెరబోయిన కొమురయ్య పాల్గొన్నారు.

రాములమ్మకు నివాళి

గార్ల : ఇమ్మడి రాములమ్మ మృతి న్యూడెమోక్రసీ పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. గురువారం గోపాలపురంలో జరిగిన ఆమె సంస్మరణ సభలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఆమె చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు.

ఆకుకూరల సాగుతో ఆదాయం



సాగుకు సిద్ధం చేసిన మడులు



ఆకుకూర కోస్తున్న రైతు దేవ్లా

బంకట్‌సింగ్ తండాలో సంవత్సరమంతా తోటల సాగు..

డోర్నకల్ : ఆరోగ్యానికి ఆకుకూరలు మేలు.. ఆకుకూరల్లో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, పోషకాలు పుష్కలంగా ఉండడంతో వాటికి డిమాండ్ పెరుగుతోంది. ఆకుకూరలు తినడం వల్ల గుండె, ఎముకలు, కంటికి మంచిది. అలాగే ఆకుకూరలు సాగు చేసి రైతులు అదనపు ఆదాయం గడిస్తున్నారు.

వివిధ రకాల ఆకుకూరల సాగు..

ఆకుకూరలను రైతులు సంవత్సరమంతా సాగు చేస్తున్నారు. తమకున్న సాగుభూమిలో కొద్దిపాటి స్థలంలో ఆకుకూరలు పండించేందుకు కేటాయిస్తున్నారు. రెండు నుంచి ఐదుగుంటల స్థలంలో మడులుగా ఏర్పాటుచేసి అందులో పాలకూర, బచ్చలికూర, తోటకూర, కొత్తిమీర, పుదిన, మెంతికూర, గోంగూరను సాగు చేస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు చల్లిన నెల రోజుల్లో ఆకు కూరలు కోతకు వస్తున్నాయి. అవి ముదరక ముందే లేత ఆకులను కోసి విక్రయిస్తున్నారు. ఆకుకూర కోతకు వచ్చే సమయంలోనే పక్కనే చిన్నచిన్న మడులు చేసి మళ్లీ



ఆకుకూరలు విక్రయిస్తున్న ఆంగోత్ నంద్యా

విత్తనాలు చల్లి తర్వాత సాగుకు సిద్ధం చేస్తున్నారు. సాగులో కొద్దిపాటి యూరియాను వాడుతామని, పురుగుల నివారణకు స్వల్పంగా మందులు పిచికారీ చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. నీటి వినియోగంతో పాటు శ్రమతక్కువ, స్వల్ప వ్యవధిలో సాగు పూర్తవుతుండటంతో రైతులు ఆకుకూర తోటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. రోజువారీ ఆదాయం తక్కువ ఉన్నా, ఇంటి ఖర్చులకు పోను, ఖాళీగా ఉండకుండా సంవత్సరమంతా సాగు చేస్తున్నామని బంకట్‌సింగ్‌తండా రైతులు తెలిపారు.

ఆకుకూరలకు ఆదరణ..

ఆకుకూరలు ఆరోగ్యానికి అన్ని విధాలుగా మేలు చేస్తుండటంతో ఆకు కూరలకు ఆదరణ పెరుగుతోంది. ఏడాదంతా తోటలో ఆకుకూరలు లభ్యమవుతుండటంతో ప్రజలు ఆదరిస్తున్నారు.

25 ఏళ్లగా సాగు చేసి విక్రయిస్తున్నా..

నాకున్న వ్యవసాయ భూమిలో 25 ఏళ్ల నుంచి అన్ని రకాల ఆకుకూరలు సాగు చేస్తున్నా. సాగు చేసిన ఆకు కూరలను సాయంత్రం కోసి మరుసటి రోజు తెల్లవారుజామున పట్టణంలో తిరిగి విక్రయిస్తున్నాను. ఆకు కూరలతో రోజువారీ తక్కువ ఆదాయం వస్తున్నా, ప్రజలు ఆకుకూరలను ఆదరిస్తున్నారు.

– ఆంగోత్ నంద్యా, బంకట్‌సింగ్‌తండా

'స్థానికం'లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు మాలోత్ నెహ్రూనాయక్

డోర్నకల్ : కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు మాలోత్ నెహ్రూనాయక్ అన్నారు. గురువారం చిలుకోడు, డోర్నకల్‌లో పర్యటించి పలువురిని పరామర్శించారు. అనంతరం డోర్నకల్‌లో కాంగ్రెస్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.



మాట్లాడుతున్న నెహ్రూనాయక్

మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, జగదీష్‌నాయక్, సుమేర్‌చంద్‌జైన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమకారులను ఆదుకోవాలి'

తొర్రూరు : తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముద్దసాని వెంకటేశ్వర్లు అన్నారు. డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో గురువారం తెలంగాణ ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 19న మహబూబాబాద్‌లో ఆత్మగౌరవ యాత్రను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కొండా వెంకన్న, డివిజన్ అధ్యక్షుడు అనపురం వెంకన్న, నాయకులు గుద్దేటి మల్లయ్య, నరసింహారెడ్డి, తాళ్ల మల్లయ్య, మన్నెం వెంకన్న, లక్ష్మయ్య, సదాకర్, వెంకటయ్యలు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

బయ్యారం : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాయిని శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా వెంకటయ్య, వీరభద్రం, ప్రధాన కార్యదర్శిగా వన్నం రామారావు, కార్యదర్శిగా కాడబోయిన వెంకన్న, కోశాధికారిగా కాసం ఉప్పల్‌రెడ్డి, గౌరవ సలహాదారులుగా రెంటాల బుచ్చిరెడ్డి, రామగిరి భిక్షంతో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

19న మహా పాదయాత్ర

గార్ల : ఈనెల19వ తేదీన అనంతారం నుంచి మానుకోట వరకు నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ మహాపాదయాత్రను జయప్రదం చేయాలని ఆ ఫోరం నియోజకవర్గ కన్వీనర్ కొమర్రాజు జగదీశ్ పిలుపునిచ్చారు. గురువారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రశాంత్, సతీష్, మల్లిబాబు, రుక్మారావు, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నెల్లికుదురు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2012–13 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు తమ గురువులను సన్మానించారు. అనంతరం చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని ఆనందగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

మహబూబాబాద్ రూరల్ : ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెచ్‌ఎంల అసోసియేషన్ వార్షిక క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్‌లను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఇస్లావత్ లచ్చిరాం నాయక్, జిల్లా కోశాధికారి సమ్మెట వెంకటేశ్వర్లు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మందుల శ్రీరాములు, వాంకుడోత్ బాలాజీ, ఎస్.వెంకటేశ్వరరావు, ఎంఈఓ రవికుమార్, యాదగిరి, రాందాస్, ఆరుద్ర వెంకటేశ్వర్లు, ఎండీ ఫారుక్, వహీద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ప్రతీనెల జీతాలు ఇవ్వాలి



నెహ్రూసెంటర్ : గ్రామపంచాయతీ కార్మికులకు ప్రతీనెల ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని టీయూసీఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం కార్మికుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెల 19వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ముంజంపల్లి వీరన్న, వెంకన్న, సూరి, సుభాష్, శ్రీను, మహేందర్, లక్ష్మి రాణి, సుజాత, వెంకటమ్మ, సరిత పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్ : ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మహాసభల పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. గునిగంటి రాజన్న, ఆకుల రాజు, సీతారాంనాయక్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

తొర్రూరు/నెల్లికుదురు : పాకాల, కొత్తగూడెం ఆదివాసీ గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఆలకుంట్ల సాయన్న, జాటోత్ భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేడు (శుక్రవారం) ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో పాకాల, కొత్తగూడెంలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. నాయకులు భిక్షపతి, శంకర్, వెంకన్న, రాములు, హనుమా, వీరన్న పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నిరసన

కేసముద్రం : అర్హులకు కొత్త పింఛన్లు ఇవ్వాలని మండలంలోని ఉప్పరపల్లి గ్రామపంచాయతీ ఎదుట ఎంసీపీఐ (యూ) ఆధ్వర్యంలో ప్లకార్డులతో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆపార్టీ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడారు. కార్యక్రమంలో ఐలయ్య, యాకస్వామి, యాకయ్య, బొల్లోజు రామ్మోహనాచారి, ఉప్పలయ్య, వెంకన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

దంతాలపల్లి : ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహించే వెయ్యిడప్పులు..లక్ష గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం కోరారు. వర్గీకరణ సాధించేందుకు ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు.

రిటైర్మెంట్ వయసు పెంపును విరమించుకోవాలి

నెల్లికుదురు : ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంచాలనే ఆలోచనను విరమించుకోవాలి టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలేరులో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విరమణపొందిన ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించలేకనే ప్రభుత్వాలు రిటైర్మెంట్ వయసు పెంచాలనే ఆలోచన చేస్తున్నారని అన్నారు. భిక్షపతి, రవి పాల్గొన్నారు.

జగన్నాథం ఆశయ సాధనకు పాటుపడాలి

నెల్లికుదురు : పేదల అభివృద్ధికి పాటుపడి అమరుడైన పెరుమాండ్ల జగన్నాథం ఆశయ సాధనకు యువత పాటుపడాలని సీపీఎం మండల కార్యదర్శి ఇసంపెల్లి సైదులు పిలుపునిచ్చారు. మండలంలోని నైనాల గ్రామంలో జగన్నాథం స్మారకార్థం మూడ్రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

పీవైఎల్ జిల్లా కమిటీల విలీనం



గార్ల : ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) కమిటీలు గురువారం మండలంలోని గోపాలపురం గ్రామంలో విలీనమైనట్లు పీవైఎల్ రాష్ట్ర నాయకులు తుడుం వీరభద్రం, సీహెచ్ గణేశ్ ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలోని రెండు పీవైఎల్ సంఘాలు విలీనం కావడం చారిత్రాత్మకం అన్నారు. సమావేశం అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సామ పాపయ్య, బట్టు చైతన్య, ఉపాధ్యక్షులుగా గౌని భద్రయ్య, బండి ప్రభాకర్, చందు వీరన్న, సాంబరాజు, సహాయ కార్యదర్శులుగా ఇర్రి రవి, అనిల్, కరుణాకర్, భరత్, కోశాధికారిగా జి.రమేశ్‌తో పాటు 21 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రభుత్వ బోరు నీరు ప్రైవేటుకు..

కొత్తగూడ : ప్రభుత్వ బోరుబావి నీటిని ప్రైవేటు వ్యక్తి పొలానికి మళ్లించిన ఘటన మండలంలోని ఓటాయిలో వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వైకుత ధామంలో అవసరాల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోరుబావి నీటిని పంచాయతీ కార్యదర్శి ప్రైవేటు వ్యక్తి వద్ద డబ్బులు తీసుకుని పొలానికి తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ బోరు నీటిని దుర్వినియోగం కాకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. ఈవిషయమై జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్‌ను వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

బహుమతుల అందజేత

కేసముద్రం : కేసముద్రంవిలేజ్‌లో సంక్రాంతి సందర్భంగా కనుమ గ్యాంగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన 10మంది మహిళలకు బుధవారం రాత్రి బహుమతులను అందజేశారు. అదే విధంగా తాళ్లపూసపల్లి గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ, ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

డోర్నకల్ : యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల రమణ కోరారు. మండలంలోని గొల్లచర్లలో గురువారం జరిగిన సంక్రాంతి క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గౌడుగు వెంకట్, పగిడిపాల వెంకటేశ్వర్లు, మేకపోతుల శ్రీనివాస్, గందసిరి ఉపేందర్, గందసిరి శ్రీనివాస్, పెంటిక వెంకట్రాములు, నిమ్మలగొట్టు నాగభూషణం, సైదులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో ప్రతిభ



మరిపెడ రూరల్ : సంక్రాంతి పండుగ సందర్భంగా సూర్యాపేట జిల్లా ముక్కుడుదేవులపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ, క్యారం పోటీల్లో మరిపెడ మండలం గుండెపుడి గ్రామానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను గ్రామస్తులు అభినందించారు.

ఉరేసుకుని ఒకరి బలవన్మరణం



వెంకటనారాయణ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఉరేసుకుని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలోని మూడుకొట్ల ప్రాంతంలో గురువారం చోటుచేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మూడుకొట్ల ప్రాంతానికి చెందిన పాము వెంకటనారాయణ (70) రెడీమేడ్ దుస్తుల వ్యాపారం చేస్తుంటాడు. అతని భార్య ఐదేళ్ల క్రితం మృతిచెందగా మనోవేదనకు గురవుతున్నాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా బుధవారం రాత్రి అన్నం తిని పడుకున్నాడు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు నిద్రలేపగా స్పందించకపోవడంతో గట్టిగా తలుపుతీసి చూసేసరికి ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు శ్రవణ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



ఉమ(ఫైల్)

మరిపెడ రూరల్ : మరిపెడ మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయం ఆఫీస్ సబార్డినేట్‌గా (అటెండర్) పని చేస్తున్న మందుల ఉమ(45) అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. ఖమ్మం జిల్లా తిరుమాలయపాలెం మండలం కుక్కలరాజారం గ్రామానికి చెందిన ఉమ 20 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం మరిపెడకు వచ్చింది. ఇక్కడే ఉపాధిహామీ పథకం కార్యాలయంలో 2011 సహాయ అటెండర్‌గా చేరి విధులు నిర్వహిస్తోంది. మూడు నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. మృతురాలికి భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఉమ మృతి పట్ల ఈజీఎస్ సిబ్బంది నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు..



మృతిచెందిన కాడెద్దు వద్ద రోదిస్తున్న మానికిరాం

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని రోటిబండ తండా గ్రామానికి చెందిన రైతు భూక్య మానికిరాం తన కాడెద్దులను మేత కోసం బయటకు తీసుకువెళ్లాడు. ఈ క్రమంలో గురువారం విద్యుత్ డీబీ సమీపంలోని ఎర్త్ వైరు తగిలి ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ రూ.80 వేల వరకు ఉంటుందని రైతు మానికిరాం రోదిస్తూ తెలిపాడు.

అందరి సహకారంతో అభివృద్ధి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్
- పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మహబూబాబాద్: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ : రాజకీయాలకతీతంగా అందరీ సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు పరిధిలోని బేతోల్, 30వ వార్డు పరిధిలోని గుండ్లకుంట కాలనీలో, 24 వార్డులో సీసీ రోడ్డు నిర్మాణం, అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మురళీనాయక్ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి , వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే 24వ వార్డులో ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు.

26నుంచి సంక్షేమ పథకాల పండుగ

నెల్లికుదురు : నియోజకవర్గంలోని పేదకుటుంబాలకు పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో మోడల్ ఇంటి నిర్మాణానికి బుధవారం అధికారులు, నాయకులతో కలసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 26 నుంచి సంక్షేమ పథకాల పండుగ వాతావరణం నెలకొంటుందని తెలిపారు. నూతన రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, తదితర సంక్షేమ పథకాలను ప్రారంభిస్తామని అన్నారు. అనంతరం వివిధ గ్రామాల్లో మృతిచెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. ఎంపీడీఓ బాలరాజు, తహసీల్దార్ రాజు, ఎంపీఓ పద్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాదవరెడ్డి, నాయకులు ప్రభాకర్ గౌడ్, సత్యపాల్‌రెడ్డి, బాలాజీ నాయక్, వెంకటేశ్వర్లు, గుట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లం పానకాన్ని పారబోస్తున్న పోలీసులు

డోర్నకల్ : సీరోలు మండల పరిధిలోని మన్నెగూడెం, కొత్తతండా, సాధుతండాల్లో గురువారం మహబూబాబాద్ ఎక్సైజ్ పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. దాడుల్లో వెయ్యి లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 21 లీటర్ల నాటుసారా, 25 కేజీల బెల్లం, 5 కేజీల ఆలంను స్వాధీనపర్చుకున్నారు. సాధుతండాకు చెందిన వాంకుడోత్ సేవ్యి, ఆంగోత్ బిచ్చు, కొత్తతండాకు చెందిన బానోత్ సంతోష్, ఆంగోత్ భద్రు, మన్నెగూడేనికి చెందిన పుట్ట నాగరాజుపై కేసులు నమోదు చేసి సీరోలు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఎక్సైజ్ ఎస్సైలు ఐ.అశోక్, జి.మౌనిక, డీటీఎఫ్ ఎక్సైజ్ ఎస్సై కిరీటి పాల్గొన్నారు.

సమన్వయ లోపంతోనే నిర్లక్ష్యం

- జిల్లా వైద్యాధికారి మురళీధర్



విచారణ చేస్తున్న జిల్లా వైద్యాధికారి మురళీధర్

సాక్షి ఎఫెక్ట్..

దంతాలపల్లి : సమన్వయ లోపంతోనే 2ఎంఎం సిరంజిని బయటి నుంచి కొనుగోలు చేయమని రోగి బంధువుతో స్టాఫ్‌నర్సు చెప్పినట్లు జిల్లా వైద్యాధికారి మురళీధర్ పేర్కొన్నారు. బుధవారం ఆస్పత్రిలో జరిగిన ఘటనపై, అలాగే 'వైద్యం అందించడం లేదని ఆవేదన' అనే కథనం సాక్షిలో ప్రచురితం కాగా గురువారం ఆయన విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో సిరంజిల నిల్వ లేదని.. ఇటీవలే ఆస్పత్రికి సరఫరా అయ్యాయని చెప్పారు. సిరంజిల సరఫరా విషయం ఆస్పత్రి సిబ్బంది ఒకరికొకరు చెప్పలేదని తెలిపారు. పండుగ అయినా, సెలవు రోజు అయినా రోగులు వైద్యం కోసం ఫోన్ చేస్తే సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆస్పత్రి వైద్యులు, సిబ్బందిపై ఉందన్నారు. మండల కేంద్రంలోని ఆస్పత్రి 24 గంటల వైద్యసేవలు అందించాల్సిందే అని గుర్తుచేశారు. వైద్యాధికారులు, ఆస్పత్రి సిబ్బంది అందుబాటులో ఉండాలని హెచ్చరించారు. ఇకపై తప్పిదాలు జరిగితే ఉపేక్షించబోమని వెల్లడించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపనునట్లు తెలిపారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సారంగం, సుధీర్‌రెడ్డి, విజయకుమార్, శ్రావణ్, వైద్యులు చైతన్య, కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతి అందజేస్తున్న సీతారాంరెడ్డి, సీఐ, ఎస్సై

మహబూబాబాద్ అర్బన్ : క్రీడల్లో గెలుపోటములు సహజమని నామిరెడ్డి సీతారాంరెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లిలో గురువారం నామిరెడ్డి వెంకట్‌రెడ్డి–పార్వతమ్మ జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి సీతారాంరెడ్డి హాజరై మాట్లాడారు. క్రీడల్లో విద్యార్థులు, యువత జమాండ్లపల్లికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నారు. అనంతరం విజేతలకు రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపికారెడ్డి, సీతారాంరెడ్డి బహుమతులు అందజేశారు. అలాగే జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ముగింపునకు అసోసియేషన్ కార్యదర్శి అజయ్‌సారథి రెడ్డి, సలహాదారులు విజయ్‌సారథి రెడ్డి హాజరై బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు



కురవి: సర్వే చేస్తున్న మండల అధికారులు



గార్ల: మాట్లాడుతున్న తహసీల్దార్ రవీందర్

డోర్నకల్ : అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందుతాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మండలంలోని గొల్లచర్లలో గురువారం ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న సర్వేను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. మేకపోతుల శ్రీనివాస్, ఆంగోత్ వెంకన్న, పి.వెంకటేశ్వర్లు, గొర్ల సత్తిరెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

రైతు భరోసా అనర్హుల గుర్తింపుపై సర్వే

మహబూబాబాద్ రూరల్ : రైతు భరోసా పథకం అమలులో భాగంగా అనర్హులను గుర్తించే ప్రక్రియ సర్వేను గురువారం చేపట్టారు. తహసీల్దార్ భగవాన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి తిరుపతిరెడ్డి, వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సర్వేలో పాల్గొన్నారు. మండలంలోని కంబాలపల్లి, ఈదులపూసపల్లి, బోడగుట్ట తండ, మహబూబాబాద్, జంగిలిగొండ, ఆమనగల్, మాదాపురం గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు.

సర్వే ప్రారంభం

కురవి : సీరోలు, కురవి మండలాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన లబ్ధిదారుల ఎంపిక సర్వే గురువారం ప్రారంభమైంది. రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ వీరబాబు, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షించారు.

రైతుభరోసా సర్వే ప్రారంభం

గార్ల : రైతుభరోసా అమలులో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సాగు యోగ్యమైన భూములను సర్వే చేస్తున్నారు. బుద్దారం, గార్ల, మర్రిగూడెం పంచాయతీల్లో గురువారం అధికారులు భూముల సర్వే నిర్వహించారు. తహసీల్దార్ రవీందర్, ఏఓ కావటి రామారావు, ఏఈఓ కిరణ్, సర్వేయర్ నందులాల్, సిబ్బంది శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల గుర్తింపునకు సర్వే

పెద్దవంగర : మండలంలోని బొమ్మకల్లు, కొరిపల్లి, అవుతాపురం గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. తహసీల్దార్ మహేందర్, ఎంపీడీఓ వేణుమాధవ్, ఏఓ స్వామి నాయక్ ఏఈఓలు, గ్రామాధికారులు పాల్గొన్నారు.